## సామ్రాజ్యవాద ప్రపంచీకరణ దుష్టవిధానాల పర్యవసానమే

## ప్రపంచవ్యాపితంగా పెరుగుతోన్న మితవాద, ప్రతీఘాత, ఫాసిస్టుశక్తులు

**నయా** ఉదారవాద పెట్టుబడిదారీ విధానం అత్యంత పెద్దగొంతుకతో పెట్టుబడిదారీ విధానానికి ప్రత్యామ్నాయమేలేదని చాటిచెపుతోంది. ప్రపంచీకరణగా పిలవబడుతున్న ఈ విధానంతో నిర్దిష్ట అభివృద్ధి ఖచ్చితంగా సాధ్యమేనని హామీ ఇస్తూ, ప్రపంచ వ్యాపితంగా విస్తరించియున్న సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ దుర్లక్షణాలన్నింటికీ సామ్రాజ్యవాద ప్రపంచీకరణే సర్వరోగ నివారిణిగా ప్రకటిస్తోంది.

కానీ, వాస్తవానికి యావత్తు మానవ కార్యకలాపాలను ద్రవ్యపెట్టుబడి తీవ్రదోపిడీకి గురిచేయటంతోపాటు, యావత్ప్రపంచంపై ద్రవ్య పెట్టుబడి పాలనను స్థిరీకరించేందుకు ఉద్దేశించినదే, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ. పెట్టుబడిదారీ విధానంలో అత్యంత సహజంగా, అనూచానంగా కొనసాగే తప్పుడు ఆర్థిక విధానాల అమలు తర్వాత, రెండున్నర దశాబ్దాల సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల అమలు తర్వాత కూడా పాదార్థిక, మేధోపర, నైతిక విలువలేమీ పెంపొందలేకపోయాయి. పైగా, అభివృద్ధిచెందిన, అభివృద్ధిచెందుతున్న దేశాలలో ఈ ప్రపంచీకరణ విధానాలు ప్రతీఘాతశక్తులను పునరుద్ధరించటంతోపాటు, ప్రపంచంలో భూమికను సాధించుకునేవిధంగా అత్యంత మితవాద రాజకీయ పార్టీల ఎదుగుదలకు, మరియు ప్రస్తుత ప్రపంచంలో సంపూర్ణంగా తిరస్కరణకు గురైన, భయంగొలిపే ఫాశిస్టుశక్తుల పెరుగుదలకు కారణ మయ్యాయి. ప్రపంచవ్యాపితంగా తలెత్తుతున్న ప్రతీఘాత శక్తులు, అంతర్జాతీయ మానవత్వ ఆదర్శాలకు అత్యంత హానికరంగా పరిణమించాయి.

గత ఎనిమిది సంవత్సరాలుగా ప్రపంచ దేశాలలో జరుగుతున్న ఘటనలు పరిశీలిస్తే, ప్రతీఘాతకత్వం పాదుకుంటూ, ప్రపంచవ్యాపితంగా విస్తరిస్తోందని పరిణామాలు సూచిస్తున్నాయి.

ప్రపంచ ద్రవ్యపెట్టుబడిదారీ విధానం చేపట్టిన అమానవీయ, క్రూర ఆర్థిక విధానాలు–ప్రపంచంలోని సహజ, మానవవనరులను ఘోరంగా దోపిడీచేసుకుంటూ ప్రపంచవ్యాపిత కార్మికవర్గాన్ని దుర్భరక్లేశంలో ముంచెత్తు తోంది; యావత్ ప్రపంచ మానవుల నడుమనా పూడ్చలేని అఖాతాల అసమానత్వాన్ని వ్యాప్తిచేస్తోంది; దురాక్రమణ యుద్ధాలు, అంతర్యుద్ధాలను ప్రేరేపిస్తోంది; నీటి కొరతలను సృష్టించటం ద్వారా అసాధారణంగా భూమండల తాపాన్ని పెంచుతోంది; ప్రపంచవ్యాప్త వ్యాధులను, ఇతర ఆరోగ్య వినాశకారకాల్ని ప్రోత్సహిస్తోంది; ప్రపంచ ప్రతీఘాత శక్తులను పెంచుతోంది. నాల్గవ విప్లవం పేరిట కొనసాగుతున్న విధ్వంసక సాంకేతిక పరిజ్ఞానం, ఇప్పటికే ప్రపంచవ్యాపితంగా ఉనికిలో వున్న అసమానతలు, నిరుద్యోగాలను అసాధారణంగా పెంచివేస్తూ, ప్రపంచ ప్రతీఘాత ఫాసిస్టుశక్తుల పెరుగుదలకు, ఆ శక్తులు గెలుపొంది అధికారం సాధించేందుకు సారవంతమైన భూమికను ఏర్పరచింది.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ సృష్టించిన 'రోబో' సాంకేతిక పరిజ్ఞానం ఫలితంగా మధ్యతరగతి ప్రజలు ఈనాడు తీవ్ర అభద్రతకు, సామాజిక అనిశ్చితికి లోనై వుండటం, ప్రతీఘాతశక్తుల పెరుగుదలకు ఒక కారణంగా వుంది. అలాగే కార్మికులపై ఘోరంగా, క్రూరంగా ద్రవ్యపెట్టుబడి సాగిస్తున్న దాడులతో కార్మిక వర్గం తీవ్ర నిరాశా నిస్పృహలకు లోనై, స్థైర్యాన్ని కోల్పోయివున్న పరిస్థితులు, ప్రతీఘాత ఫాసిస్టుభావాలకు, అభివృద్ధి నిరోధక, తిరోగమన భావాలకు వారు లోబడటానికి అవకాశం కల్పిస్తోంది.

వివిధ దేశాలలో ప్రభుత్వాలు విద్య, ఆరోగ్య రక్షణవంటి ప్రభుత్వ సేవలలో భారీకోతలను విధిస్తూ, పొదుపు చర్యలపేరిట అమలుచేస్తున్న విధానాలు పేదరికాన్ని మరింతగా పెంచుతున్నాయి; పేదలను నిరుపేదలుగా దిగజారుస్తూ అత్యంత అభివృద్ధి నిరోధక శక్తుల బోధనలకు, దుష్ప్రచారానికి లోను చేస్తున్నాయి. వలస వచ్చినవారే ఉద్యోగాలన్నింటినీ దొంగిలిస్తున్నారని, ప్రజా సమూహాల పేదరికానికి, నేరాలు పెరిగిపోవటానికి, సంక్షేమ పథకాలు సక్రమంగా చేరకపోవటానికి వారే కారణమనే దుష్ప్రచారాలకు కార్మికులు లోనవుతున్నారు. ఈ విధమైన సాధారణ ఆర్థిక పదజాలంతో మితవాద పార్టీలు జాత్యహంకారాన్ని, కార్మికుల నడుమ, ఆదివాసుల నడుమ భావోద్వేగాలను ముసుగులో వ్యాప్తిజేస్తున్నాయి. తమ సూపర్ లాభార్జనకోసం ప్రపంచ ద్రవ్యపెట్టుబడి నేర్పుగా దిగుమతి చేసిన కారుచౌక శ్రామికులకు వ్యతిరేకంగా మంటలను రాజేస్తున్నాయి. ప్రపంచవ్యాపితంగా మానవత్వ విధ్వంసానికి, కార్మికుల దుర్భరస్థితిగతులకు కారణమైన నయా ఉదారవాద పెట్టుబడిదారీవ్యవస్థను, సామ్రాజ్యవాద అంతర్జాతీయ ద్రవ్య మరియు వాణిజ్య సంస్థలను లక్ష్యంగా చేసుకోవటానికి బదులుగా, ఈ అభివృద్ధి నిరోధక, ఛాందస, మితవాద, ప్రతీఘాత శక్తులు, వీరికి ప్రాతినిధ్యం వహించే రాజకీయపార్టీలు – సామాజికంగా, మతపరంగా, ఆదివాసులపరంగా ప్రపంచ ప్రజానీకంలో చీలికలు కల్పిస్తున్నాయి; నిలకడగా ప్రజల మధ్య ఆరని చిచ్చును రగుల్చుతూ సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ విధాన మార్గదర్శకత్వంలో, ఆ దన్నుతో ప్రపంచీకరణ ముసుగులో ప్రజానీకానికంతటికీ నిజమైన శత్రువు అయిన ద్రవ్య పెట్టుబడికి వ్యతిరేకంగా పోరాట మొనను ఎక్కుపెట్టనీయకుండా ప్రక్కదోవ పట్టిస్తున్నాయి.

స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలకు మారుపేరుగా ప్రకటించుకుంటున్న, ప్రజాస్వామ్యంలో ప్రగాఢ విశ్వాస ముందని చెప్పుకుంటున్న అమెరికాలో ఆఫ్రో - అమెరికన్లపై జాత్యహంకార దాడులు పెచ్చుమీరుతున్నాయి. ఒక ఆఫ్రో అమెరికన్‌గా చెప్పుకుంటున్న వ్యక్తే దేశాధినేతగా వున్న ఈ కాలంలోనే ఆఫ్రో - అమెరికన్లపై క్రూరమైన దాడులు పెరిగిపోతున్నాయి.

రిపబ్లికన్ పార్టీకి చెందిన అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ఓటర్ల నుండి మద్దతును కూడగట్టగల్గుతున్నాడు. డొనాల్డ్ ట్రంప్‌కు, అతని అసహనపు మితవాద పిడివాదానికి ఆశ్చర్యకరమైనంత భూమిక లభిస్తోంది. హిస్పానిక్కులను, నల్లజాతివారిని, "చైనీయుల" వంటి విదేశాల నుండి వచ్చినవారిని ఎంచుకొని అతను దాడిచేస్తున్నాడు. వలసవచ్చిన వారిపై, మహిళలపై, మైనారిటీలపై అతను అత్యంత ఛాందసవాద, అభివృద్ధి నిరోధక, యుద్ధోన్మాద వ్యాఖ్యానాలు చేస్తున్నాడు. అమెరికాలో నూతన మధ్యతరగతి అతని చుట్టూతా సమీకృతమౌతోంది. మరోవైపున, డెమోక్రటిక్ పార్టీకి చెందిన అధ్యక్ష అభ్యర్థి హిల్లరీ క్లింటన్ కూడా సాధారణ అమెరికా ప్రజలను, వారి ఆకాంక్షలను దిగజార్చిన, నిరాశకు గురిచేసిన వ్యవస్థలపట్ల తను ఏ రకంగానూ వ్యతిరేకంగా ఉండబోనని ట్రంప్‌కన్నా మెరుగైనదానను కాననీ తనకు తాను నిరూపించుకుంటోంది.

స్వేచ్ఛా, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి ప్రజాస్వామిక, ఉదారవాద భావాలకు మాతృభూమి అయిన ఐరోపాలో మితవాద పార్టీలు తమ పట్టును పెంచుకుంటున్నాయి. యూరోపియన్ యూనియన్ దేశాలలో ఆయా ప్రభుత్వాలు అమలుచేసిన పొదుపు చర్యల ఫలితంగా పేదరికంలోకి నెట్టబడిన శ్రామిక ప్రజలలో అత్యంత మితవాద, ఛాందసవాద భావాలను పాదుగొల్పిన ఫలితమే 'బ్రెగ్జిట్'.

యుద్ధం కారణంగా కకావికలై, సిరియా నుండి కొనసాగుతున్న వలసల మహాప్రవాహం సృష్టించిన మందకొడి ఆర్థికవ్యవస్థ, సంక్షోభాలు - యూరోపియన్ యూనియన్ దేశాలలో అత్యంత మితవాద పార్టీలు తమ పట్టు పెంచుకునేందుకు దోహదపడ్డాయి. ఫ్రాన్స్‌లో వలసల వ్యతిరేక, యూరోపియన్ యూనియన్ వ్యతిరేక, 'ప్రొటెక్షనిస్ట్ నేషనల్ ఫ్రంట్', జర్మనీలో 'ఫార్ - రైట్ ఆల్టర్‌నేటివ్ ఫర్ జర్మన్ పార్టీ', ఆస్ట్రియాలో 'యాంటి ఇమ్మిగ్రెంట్ ఫ్రీడమ్ పార్టీ', హంగేరి, పోలెండ్‌లలో మితవాద పార్టీలు - వంటివన్నీ ప్రపంచంపై ద్రవ్య పెట్టుబడి పాలన యొక్క దుష్పరిణామాలుగా ముందుకొచ్చాయి.

జర్మనీలో తిరిగి నాజీయిజమ్ 'ఫార్ - రైట్ ఆల్టర్‌నేటివ్ ఫర్ జర్మన్ పార్టీ' పేరుతో పట్టు పెంచుకొంటున్నది. గ్రీస్‌కు అందించే సహాయం నిలిపి వేయాలని, వలస వచ్చేవారిని, కాందిశీకులను దేశంలోకి ప్రవేశించనీయరాదని ఆ పార్టీ డిమాండ్ చేస్తోంది. అది ఇస్లామ్‌కు వ్యతిరేకంగా వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించింది. ఇస్లామ్ భావాలను, ముస్లిములను, వలసలను వ్యతిరేకిస్తూ ఆ పార్టీ ప్రచారం నిర్వహిస్తోంది. 'పశ్చిమదేశాల ఇస్లామీకరణకు వ్యతిరేకంగా, దేశభక్తియుత యూరోపియన్లు' అనే సంస్థ నాయకులు, మరియు 'ఆల్టర్‌నేటివ్ ఫర్ జర్మనీ పార్టీ' నాయకులు ఉపయోగించే భాష, భావజాలం అడాల్ఫ్ హిట్లర్ ఉపయోగించిన భాషకు, భావాలకు అతి దగ్గరగా వుంది. ఇస్లామ్ మతానికి వ్యతిరేకంగా ఎక్కుపెట్టిన వీరు, ముస్లిములకు వ్యతిరేకంగా ద్వేషాన్ని, అసహనాన్ని పెంచుతున్నారు.

ఇటీవల గ్రీస్ దేశంలోని ఫిలిప్పి మరియు ఒరైకాస్ట్రో పట్టణాలలో తల్లిదండ్రుల సంఘాల ప్రతినిధులు తమ బిడ్డలు చదువుకుంటున్న పాఠశాలల్లో వలస వచ్చినవారి పిల్లలు చేరటాన్ని వ్యతిరేకిస్తూ విద్యా మంత్రిత్వశాఖకు ఓ లేఖ రాశారు : "ఎట్టి పరిస్థితుల్లోనూ, ఎలాంటి రాజీ లేకుండా స్పష్టంగా మరియు వివరంగానూ తాము ప్రకటిస్తున్నదేమంటే, అక్రమ వలసదారులుగా చెప్పబడుతున్నవారి పిల్లలు మా బిడ్డలు చదువుతున్న పాఠశాలల్లో ప్రవేశించటానికి అంగీకరించబోము" అని, "ఇతర ఖండాల నుండి వలస వచ్చిన వారి పిల్లలు పూర్తి భిన్నమైన ఆరోగ్యపరిస్థితులు, భిన్నమైన వ్యాధులతో, భిన్నమైన ఆకారాలను కలిగి వుంటార"ని, కనుక వారు దేశంలోని విద్యాసంస్థల్లో చేరితే "పాఠశాలల గ్రీకు స్వభావం" మారిపోతుందని వారు ఆ లేఖలో పేర్కొన్నారు. "వలసవచ్చిన వారి మత మౌఢ్యాన్ని మేమెన్నడూ అంగీకరించబోము" అని వారు పేర్కొన్నారు. వలస వచ్చిన వారి పిల్లలను పాఠశాలల్లో చేర్చుకునేట్లయితే దానికి నిరసనగా తల్లిదండ్రుల సంఘాలు పాఠశాల ఆవరణలను ఆక్రమించుకోవటానికి సిద్ధమని కూడా వారు హెచ్చరించారు. దీనికి కొద్దిరోజుల ముందుగా, ఆ ప్రాంతంలో కొన్ని ఇళ్ళలోకి వలస వచ్చినవారు ప్రవేశించనున్నారనే పుకార్ల నడుమ ఒరైకాస్ట్రో మేయర్ ఓ ప్రకటన చేస్తూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకో వలసిందిగా స్థానికంగా నివశిస్తున్నవారికి పిలుపు నిచ్చాడు. వలసల వ్యతిరేక, కాందిశీకుల వ్యతిరేక ప్రతీఘాత భావాలు గ్రీస్‌లో ఏవిధంగా, ఏ స్థాయిలో వ్యాపించి వున్నాయో, పాతుకుపోయాయో ఈ ఉదంతం తెలియజేస్తోంది.

ఇంగ్లాండ్‌లో బ్రెగ్జిట్ తర్వాత జాత్యహంకారదాడులు పెరిగాయి. యూరోపియన్ యూనియన్ నుండి బయటకు రావాలనే ఇంగ్లాండ్ నిర్ణయం తర్వాత ఇంగ్లాండ్‌లో వరుసగా అనేక సంఘటనలు చోటుచేసుకున్నాయి. వలసవచ్చిన వారిపై దౌర్జన్యాలు చేస్తూ, వారిని తిరిగి వారి మాతృదేశం వెళ్ళిపొమ్మని బెదిరింపులకు గురి చేశారు. పోలిష్ జనసమూహానికి వ్యతిరేకంగా, వారిని ఉద్దేశించి విభ్రాంతి కల్గించే దూషణల సంఘటనలు జరిగాయి. 'యూరోపియన్ యూనియన్ నుండి వైదొలగాలి - అలాగే పోలిష్ క్షుద్ర పురుగులు కూడా' అని లండన్‌లో హామర్ స్మిత్ సెంటర్ వద్ద పోలిష్ జనసమూహం అధికంగా నివసించే చోట గోడపై గజిబిజి రాతతో రాశారు; అదేరకపు దూషణలతో కూడిన ప్లకార్డులను కేంబ్రిడ్జిలోని హెమ్టింగ్‌టన్‌లో పోలిష్ జనసమూహం వుండే ప్రాంతంలో

అంటించారు. జాత్యహంకార వ్యతిరేక వేదిక 'ఫార్ రైట్ వాచ్' కథనం మేరకు 3 రోజుల కాలవ్యవధిలో మౌఖికంగా దూషణల నుండి భౌతిక హింస వరకు 90కి పైగా ఘటనలు జరిగాయి. ఫ్యాక్టరీ కార్మికులు, వ్యవసాయ కార్మికులు, నిరుద్యోగులు వంటి ఆర్థికంగా దుర్బలురైన వారితోసహా, ప్రపంచ ద్రవ్యపెట్టుబడి యొక్క సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల కారణంగా కునారిల్లి, అసంతృప్తితో వున్నవారంతా ఈ జాత్యహంకార భావాలకు, దురభిమానానికి లోనయ్యారు. 2016 జూన్, జులై నెలల్లో ఈ ద్వేషపూరిత నేరాలు ఎలా పెరిగాయో స్కాట్‌లాండ్ యార్డ్ కమీషనర్ సర్ బెర్నార్డ్ హోగాన్ పేర్కొంటూ, ఈ దాడులన్నీ ప్రత్యేకించి తూర్పు ఐరోపా వాసులకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడ్డాయన్నారు. పాత యూరోపుకు చెందిన 'యూదు వ్యతిరేక ఉన్మాదం'తో మరియు యూరపులోని అతిమితవాదంతో యూదు ప్రజా సమూహాల ఉనికే ప్రశ్నార్ధకంగా మారిపోయిందని 'కాన్ఫరెన్స్ ఆఫ్ యూరోపియన్ రబ్బీస్' అధ్యక్షుడు పింఛాస్ గోల్డ్‌ష్మిద్ పేర్కొన్నాడు. యూరోపియన్ దేశాలలో 'యాంటి – సెమిటిజమ్' ప్రాచుర్యంలో వుందని అతను చెప్పాడు. 9 యూరపు దేశాలలో నిర్వహించిన సర్వే ప్రకారం యూదులు వారి భద్రత అంశంలో భయం కారణంగా 22 శాతం సామాజిక కార్యక్రమాలకు హాజరుకాకుండా తప్పుకుంటున్నారు. ఫ్రాన్స్‌లో 1200 మంది యూదులను సర్వేచేయగా 40 శాతం మంది తాము మతపర చిహ్నాలను ధరిస్తే, తమను యూదులుగా గుర్తించి, తమపై దాడులు జరుపుతారనే భయంతో వాటిని ధరించకుండా వుంటున్నామని తెలిపారు. యూరోపియన్ యూనియన్‌లో మానవత్వపు దుస్థితి ఈవిధంగా వుంది!

డెన్మార్క్, నెదర్లాండ్స్ మరియు ఆస్ట్రియాలలోనూ మితవాద, ప్రతీఘాత పార్టీలు ప్రాబల్యం పొందుతున్నాయి.

సంఘ్‌పరివార్ వంటి ప్రతీపశక్తుల దన్నుతోనున్న బిజెపి మనదేశంలో ప్రభుత్వాధికారాన్ని చేజిక్కించుకుంది. హిందూ మతోన్మాద శక్తులు సమాజం మొత్తంలో వ్యాపించి మత మైనారిటీల, దళితుల, అణచబడిన సెక్షన్ల ప్రజానీకపు మనుగడను కంటకావృతం చేస్తూ పాలన సాగిస్తున్నాయి; సాంస్కృతిక పోలీసులుగా వ్యవహరిస్తున్నాయి. గోరక్షక్‌ల ముసుగులో అరాచక గుంపుల దాడులు విస్తారంగా జరుగుతున్నాయి. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా జాతీయ దురహంకారం అధికారయుతంగానే ఎగదోయబడుతున్నది. 'ఉగ్రవాదంపై పోరాటం' ముసుగులో ఇస్లాముపై వ్యతిరేకత రెచ్చగొట్ట బడుతున్నది. 'చట్టబద్ధ పాలన'ను చట్టమే పాలనగా మార్చివేశారు. ప్రజాస్వామికంగా ఆలోచన చేసేవారిపై, కార్యకర్తలపై, రాజకీయ ప్రత్యర్ధులపై దాడిచేసేందుకే చట్టం ప్రయోగించబడుతున్నది. 2016 జూన్‌లో హిందూ మతతత్త్వ సంస్థ అయిన 'హిందూసేన' మధ్య ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద డొనాల్డ్ ట్రంప్ పుట్టినరోజు వేడుకలను పండుగ బట్టలు, బూరలు, పోస్టర్లు తదితర హంగామాలతో ఎంతో ఆర్భాటంగా నిర్వహించింది. ప్రతీఘాత శక్తులు ప్రాబల్యం పొందుతూ ఇప్పటికే చిరుగులు పడిన ఈ సమాజానికి తీవ్ర హెచ్చరికగా పరిణమించనున్నాయి.

ఈ పరిణామాలన్నీ ద్రవ్య పెట్టుబడిదారీ విధానపు ఏలుబడిలో పెట్టుబడిదారీ విధానపు అనివార్య, సహజ పరిణామాలైన 2008 నాటి ప్రపంచ ఆర్ధిక సంక్షోభ దుష్ఫలితాలే. మరోమాటల్లో చెప్పాలంటే, నయా ఉదారవాద సామ్రాజ్యవాద ప్రపంచీకరణ వైఫల్యం యొక్క ఫలితాలే ఈ తిరోగమన పరిణామాలన్నీ! ద్రవ్య పెట్టుబడిదారీ విధానం, ప్రపంచ దేశాలపై రుద్దిన పెట్టుబడిదారీ వ్యవస్థ, ఈ పరిణామాలను ఏవిధంగానూ మరమ్మత్తు చేయజాలదు. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ యొక్క ఘోరమైన దుష్ఫలితాలివి.

పెట్టుబడిదారీవ్యవస్థ ఏ రూపంలో వున్నాకానీ అది ప్రజల జీవితాలలో అభివృద్ధిని, సౌభాగ్యాన్ని తీసుకురాలేదని రుజువైన వాస్తవం. కాగా, ఈ పెట్టుబడిదారీ విధానపు సంక్షోభం తిరోగమన, ప్రతీఘాతుక, ఫాశిస్టు విధానాలకు దోవతీస్తుందనేది అంతే వాస్తవం.

ఉదారవాదులైన లేదా ఛాందసులైన పార్లమెంటరీ రాజకీయపార్టీలుగానీ లేదా అధికార దాహంకల వామపక్షాలు కానీ పెట్టుబడిదారీ విధానం సృష్టిస్తున్న విధ్వంసానికి, విలయానికి ప్రత్యామ్నాయం కాలేవు, కావుకూడా. ప్రపంచ మానవాళికంతటికి సమానత్వాన్ని, అభివృద్ధిని అత్యున్నత సార్వత్రిక సంక్షేమాన్ని, అందజేయ గలిగేది కమ్యూనిజం ఒక్కటి మాత్రమే!

కమ్యూనిజం పతాకను చేబూని శాస్త్రీయ వర్గ రాజకీయ శస్త్రధారులైన కార్మికవర్గం మాత్రమే, చరిత్ర తమ భుజస్కంధాలపై వుంచిన బృహత్తర కర్తవ్యాన్ని చేబూని, యావత్తు మానవజాతి పాలిట పెనుశాపంగా, అభివృద్ధికి ఆటంకంగా నిలిచిన ఈ ప్రతీఘాతుక, ఫాసిస్టు శక్తులను ఓడించి తీరుతారు.

ooooo